క్లుప్తంగా

శివకుమార స్వామీజీకి నివాళి



నివాళులర్పిస్తున్న నేతలు

పెద్దపంజాణి: వీరశైవ లింగాయత్ జంగమ సేవా సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ శివకుమార స్వామీజీకి నివాళులర్పించారు. మంగళవారం ముత్తుకూరు బసవేశ్వరస్వామి ఆలయంలో కర్ణాటక తుమ్‌కూరు జిల్లా సిద్ధగంగమఠం స్వామీజీ కర్ణాటక రత్న, పద్మభూషణ్, డాక్టర్ శివకుమారస్వామీజీ 118 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించారు. సంఘం ప్రధాన కార్యదర్శి సొన్నేపల్లి ప్రవీణ్, అర్చకులు కరి వీరయ్య, మాజీ సర్పంచ్ మణి, నేతలు వీరగౌడ్, రవిచంద్రగౌడ్, బసవరాజు గౌడ్ పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై న్యాయం జరగాలి



సంతాపం తెలుపుతున్న పాస్టర్లు

పులిచెర్ల(కల్లూరు): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపి సరైన న్యాయం జరిగేలా చూడాలని కల్లూరు చర్చి పాస్టర్ ధనరాజ్ తెలిపారు. మంగళవారం కల్లూరు బీసీ కాలనీలోని చర్చిలో జిల్లాలోని మండలాల నుంచి విచ్చేసిన పాస్టర్లు చర్చిలో ఆయన మృతికి సంతాపంగా ప్రార్థనలు చేశారు. ప్రవీణ్ పగడాల కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు జార్జి జాన్సన్, తిమోతి, సంపత్, ప్రతాప్, డేవిడ్, శివ, ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, ఏలయ్య, ఎర్రయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

రొంపిచెర్ల: రొంపిచెర్లలో పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. పబ్లిక్ పరీక్షల్లో ప్రతి ఏడాది మాస్ కాపీయింగ్ జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు రెండు సీసీ కెమెరాలను చోరీ చేశారు. దీంతో అందరి దృష్టి రొంపిచెర్ల పరీక్ష కేంద్రాలపైనే ఉండడంతో అధికారులు ఎలాంటి కాపీయింగ్ జరక్కుండా పరీక్షలను నిర్వహించారు.

ముగిసిన పది పరీక్షలు

పలమనేరు: మండలంలో పది పరీక్షల్లో భాగంగా మంగళవారం సోషియల్ పరీక్ష జరిగింది. ఇక్కడి ఏడు సెంటర్లలో 1,377మంది విద్యార్థులకుగానూ 1,367 మంది హాజరయ్యారు. పదిమంది గైర్హాజర్ అయ్యారు. పరీక్ష ప్రశాంతగా జరిగిందని ఎంఈఓ బాలసుందరం తెలిపారు. దీంతో పది పరీక్షలు ముగిశాయని ఆయన తెలిపారు.

90 నీటి తొట్టెలకు నిధులు



నీటి తొట్టెల పనులను ప్రారంభిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: ఉపాధి పథకంలో 90 నీటి తొట్టెల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు ఏపీఓ బాలమురళి తెలిపారు. మంగళవారం ఆయన పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీలో మూగజీవాలకు నీటి తొట్టెల పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మూగజీవాలు నీటి కోసం ఇబ్బంది పడకూడదని నీటి తొట్టెలను నిర్మింస్తోందన్నారు. ఒక తొట్టె నిర్మాణానికి రూ.30 వేలు ఖర్చు చేస్తామని తెలిపారు. నీటి సౌకర్యం ఉన్న చోట మాత్రమే తొట్టెలను నిర్మిస్తామని తెలిపారు. అవకాశాన్ని పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేతలు చల్లా రామచంద్రారెడ్డి, రవికుమార్‌నాయుడు, ఓబులేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అంగవైకల్య బాధితులకు అండ



హసీంకు నిర్మించి ఇచ్చిన ఇల్లు

పలమనేరు: అంగవైకల్యంతో బాధపడుతున్న పేదలకు పక్కా ఇల్లు లేకుంటే తాము వారికి అండగా నిలబడి పక్కా ఇంటిని నిర్మించి ఇస్తున్నట్టు ప్రాజెక్ట్ షెల్టర్ నిర్వాహకులు జార్జ్ కన్నన్ తెలిపారు. ఆమేరకు మండలంలోని కల్లాడు గ్రామంలో హసీం అనే దివ్యాంగునికి తమ సంస్థ ద్వారా నిర్మించిన పక్కా ఇంటిని సోమవారం వారు ప్రారంభించారు. మండలంలో ఇలాంటి పేద దివ్యాంగులను సర్వే చేసి ఇళ్ల నిర్మాణాలను తమ సంస్థ ద్వారా చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు.

పచ్చగడ్డికి ప్రత్యామ్నాయం పాతరగడ్డి

- వేసవిలో పాడి రైతులకు తప్పని మేత కష్టాలు
- కట్ట వరిగడ్డి రూ.230
- పాతరగడ్డి ఎంతో మేలు
- పిట్స్ వేసుకున్నా మేలో వాడుకోవచ్చు



డా.అరుణ



పశుగ్రాసంతో పేర్చిన పాతర గడ్డి



బంకమట్టితో కప్పేసిన పశుగ్రాసం

పలమనేరు: వేసవి కారణంగా పశువులకు పచ్చగడ్డి సమస్య వచ్చింది. ఎండుగడ్డిని కొందామంటే ధర లెక్కువ. దీంతో పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని పాడి రైతులకు మేత కష్టాలు తప్పడం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు నీటి సౌకర్యం ఉండి ఇప్పటికే పొలంలో గడ్డి, జొన్న లాంటి పశుగ్రాసాలున్న రైతులు పాతరగడ్డి (సైలేజ్ పిట్స్)ని తయారు చేసుకుంటే మేలని పలమనేరు పశుపరిశోధనా కేంద్రం సైంటిస్ట్ అరుణ సూచిస్తున్నారు. పాతర గడ్డి యూనిట్లను తమ ఇళ్ల లేదా పొలాల వద్ద ఏర్పాటు చేసుకుంటే పశువులకు పౌష్టికాహార మేత అందుబాటులోకి వస్తుంది. దీన్ని ఎలా చేపట్టాలో సైంటిస్ట్ వివరించారు.

సైలేజ్ పిట్స్‌ను ఎలా నిర్మించుకోవాలంటే..

ఈ ప్రాంతంలో రైతులు పశుపోషణపై ఆధారపడి ఎక్కువ మంది ఉన్నారు. వీరు పొలాల్లో పశుగ్రాసాన్ని సాగు చేస్తున్నారు. పది పాడి ఆవులు ఉన్న రైతు రూ.5వేలు ఖర్చు చేస్తే మూడు నెలలకు సరిపడా పచ్చగడ్డిని సిద్ధం చేసుకోవచ్చు. దీనికోసం ఎనిమిది అడుగుల లోతు, పది అడుగుల పొడవుతో గుంతను తవ్వుకోవాలి. రైతుల పొలాల్లోని మొక్కజొన్న, జొన్న, సజ్జలు, లేదా బహువార్షిక పశుగ్రాసాలను పూత దశలో లేదా గింజ దశలో ఉన్నప్పుడు కత్తిరించుకోవాలి. ఇందులో శక్తినిచ్చు కార్బోహైడ్రేట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని చాప్‌కటర్‌తో ఇంచి పొడవు ముక్కలుగా చేసి సైలేజ్‌పిట్‌లో రెండు అడుగుల ఎత్తువరకు లేయర్లుగా నింపుకోవాలి. ప్రతివరుసపై ఒక శాతం బెల్లం నీళ్లు, ఒక శాతం రాళ్ల ఉప్పును చల్లాలి. దీంతో పశుగ్రాసం తియ్యగానూ, నిల్వ ఉంచుకునే గుణం పెరుగుతుంది. సిలీంద్రాలు, బూజులతో గ్రాసం పాడవకుండా ఉంటుంది. ప్రతి వరుసలో గాలిబుడగలు లేకుండా బాగా అనగదొక్కాలి. ఇలా చేస్తూ పిట్ పూర్తిగా మునిగిపోయాక పైదశ వరకు నింపిన వరుసల్లోకి గాలిపోకుండా చెత్తను కప్పి బంకమట్టితో మూత పెట్టాలి. కనీసం నెల తర్వాత ఈ గడ్డిని ఓ వైపు నుంచి తెరచి కావాల్సినంత పశుగ్రాసాన్ని పొందవచ్చు. ఇప్పుడు సైలేజ్ పిట్స్ సిద్ధం చేసుకుంటే మే, జూన్ నెలకు పాడి పశువులకు పౌష్టికాహార మేత సిద్ధమవుతుంది. సైలేజ్‌పిట్స్ గురించి ఏదేనీ అనుమానాల నివృత్తి కోసం పలమనేరు సమీపంలోని శ్రీవెంకటేశ్వరా వెటర్నరీ యూనివర్సిటీ పశు పరిశోధన కేంద్ర అధికారులను సంప్రదించవచ్చు.



తొట్టెలో నింపుతున్న పశుగ్రాస ముక్కలు

సద్వినియోగం చేసుకోండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ కృపానంద్

గంగవరం: సప్తగిరి గ్రామీణ బ్యాంక్ 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఖాతాదారులకు పలు రకాల ఆర్థిక సేవలు, డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందిస్తున్నట్టు బ్రాంచ్ మేనేజర్ కృపానంద్ తెలిపారు. ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్‌తో కొత్తగా ప్రాయోజితం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ గంగవరం బ్రాంచ్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం మేనేజర్‌తో పాటు బ్యాంకు సిబ్బంది కలిసి ఆటోలో ర్యాలీ చేస్తూ ప్రజలకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. బ్యాంకు సేవలు, వడ్డీ వివరాలు గురించి ఆయన వివరిస్తూ ఖాతాదారులకు మరింత మెరుగైన యూపీఐ, ఐఎంపీఎస్, నెఫ్ట్ బ్యాంకింగ్ ఇతరత్రా సేవలను అందించడమే కాకుండా లాకర్ సదుపాయం కూడా అందుబాటులోకి తెచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు గంగవరం శాఖలో సంప్రదించాలన్నారు.

గిన్నీస్ బుక్ రికార్డు గ్రహీతలకు అభినందన



మహిళా గ్రూపు సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

పలమనేరు: పట్టణానికి చెందిన మెప్మా గ్రూపు మహిళలు ఆన్‌లైన్ వ్యాపారంతో గిన్నీస్‌బుక్ రికార్డులను సాధించినందుకు స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి వారిని అభినందించారు. ఆమేరకు స్థానిక మున్సిపల్ మెప్మా కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడి మహిళా సభ్యులు వారు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో వ్యాపారాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇందుకు ఇక్కడి అధికారులను ఆయన అభినందించారు. మరోవైపు గంగవరం మండలంలోని కీలపట్ల పంచాయతీలో ఈజీఎస్ పనుల్లో భాగంగా రూ.63లక్షలతో మొదలైన 187 పశువుల నీటి తొట్టెలను ఆయన ప్రారంభించారు. డ్వామా పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది.. దరి చేరని లక్ష్యం

- వారానికి నాలుగు గ్రామాల్లో నిర్వహించాలి
- రెండు గ్రామాల్లో నిర్వహించి మమ అనిపిస్తున్న వైనం
- కార్యక్రమాలకు ఇతర శాఖల అధికారులు డుమ్మా



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జాడలేని అనుబంధశాఖ అధికారులు (ఫైల్)

బంగారుపాళెం: రైతులకు సాగుపై అవగాహన కల్పించి సస్యరక్షణలో శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది వ్యవసాయం లాభసాటిగా మార్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి మొదలుపెట్టింది. ఇందులో వ్యవసాయాధికారులతోపాటు అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని రైతులకు వ్యవసాయాభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది. గ్రామాల్లోని రైతుల క్షేత్రాలను సందర్శించడంతోపాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వారికి అవసరమైన సమాచారాన్ని అందించాలి. విత్తన ఎంపిక మొదలు ఎరువులు, తెలుగు, పురుగుల నివారణ మందులు, సాంకేతిక పరిజ్ఞానం అన్ని సమస్యలపై నేరుగా చర్చించి అవగాహన కల్పించాలి. అయితే క్షేత్ర స్థాయిలో ఇందుకు విరుద్ధంగా సాగుతోంది. వ్యవసాయాధికారులు మినహా మిగిలినవారు పొలంపిలుస్తోంది కార్యక్రమంలో కనిపించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 31 మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాలు చొప్పున వారానికి నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాల్సి ఉంది. కానీ ఆశయానికి అనుగుణంగా ఈ కార్యక్రమం నిర్వహించకపోవడంతో లక్ష్యానికి దూరంగా సాగుతోంది.

కార్యక్రమం నిర్వాహణ ఇలా..

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు పొలం బాటపట్టి పంటల సాగుపై చర్యలు జరపాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయాలి. వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించాలి. క్షేత్ర సమస్యలకు తక్షణమే పరిష్కారం సూచించాలి. తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి, ఎక్కువ నికర ఆదాయం దిశగా ప్రోత్సహించాలి.

మిగతా అధికారులు ఎక్కడ?

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులతోపాటు అనుబంధశాఖలైన హార్టికల్చర్, సెరికల్చర్, ఫిషరీష్, వెటర్నరీశాఖ, మార్కెటింగ్ అధికారులు, విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, విద్యుత్, జలవనరుల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సి ఉంది. వారితో పాటు రైతు మిత్ర సంఘాలు, భూసార పరిరక్షణ అధికారులు హాజరై వ్యవసాయ అభివృద్ధిని అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి. ప్రభుత్వ పథకాలు, సంక్షేమం, రాయితీలను వివరించి రైతుల్లో చైతన్యం పెంచాలి. 2024–25 ఏడాదికి సంబంధించి సెప్టెంబర్ 24వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. మొదటి షెడ్యూల్ పూర్తయి ప్రస్తుతం రెండో విడత షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మిగిలినశాఖ అధికారుల జాడ లేదని రైతులు వాపోతున్నారు.

ముందస్తు సమాచారం లేక డీలా..

ఏ రోజు ఏ గ్రామంలో కార్యక్రమం జరుగుతుందో అని గ్రామాల్లో ముందస్తు సమాచారం లేకపోవడంతో రైతులు ఎవరి పనుల్లో వారు ఉంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వారి షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి అటుగా వచ్చి వెళ్లే రైతులను కూర్చోబెట్టి కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విత్తు నుంచి ఉత్పత్తి వరకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై చాలా మందికి అవగాహన భ్రమగానే మారిందని విమర్శలు ఉన్నాయి.

లీలావతమ్మ సేవలు ప్రశంసనీయం



విశ్రాంత ఉపాధ్యాయురాలు లీలావతమ్మను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: విద్యాశాఖలో ఉపాధ్యాయురాలుగా లీలావతమ్మ అందించిన సేవలు ప్రశంసనీయమని ఎంఈఓ నాగేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు లీలావతమ్మ గత నెల 31న ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక ఎంఆర్‌సీ కేంద్రంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు లీలావతమ్మకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, 36 ఏళ్లుగా లీలావతమ్మ వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయురాలుగా పనిచేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకిత భావంతో చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆమెను దుశ్శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న దాత

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వేసవి దృష్ట్యా చిత్తూరు నగరం గిరింపేటలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం దాత పార్థసారథి నాయుడు చలివేంద్రం ప్రారంభించారు. పాదయాత్రగా వెళ్లే తిరుమల వెళ్లే వారికి ఈ మజ్జిగ పంపిణీ చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమం 40 రోజుల పాటు కొనసాగుతుందని దాత పేర్కొన్నారు. సభ్యులు భాస్కర్, మురళి, కంద పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో నీటి తొట్టెలు

పుంగనూరు: ఉపాధి పథకం కింద నాణ్యతా ప్రమాణాలతో నీటి తొట్టెలు నిర్మించే కార్యక్రమం చేపట్టినట్లు ఏపీఓ శివకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని మాగాండ్లపల్లిలో నీటి తొట్టెల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఉపాధి పథకంలో పూర్తిగా నాణ్యతా ప్రమాణాలతో తొట్టెలు నిర్మిస్తామని, ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

7 నుంచి ఫౌండేషన్ కోర్సులు

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వ బసవరాజ జూనియర్ కళాశాలలో పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫౌండేషన్ కోర్సులు ఈనెల 7 నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ దయానందరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫౌండేషన్ కోర్సులకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోర్సుల్లో చేరే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు నోటు పుస్తకాలు, పెన్నులు వస్తువులు ఉచితంగా అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఫౌండేషన్ కోర్సులకు పేర్లు నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు సురక్షితం



రమాదేవికి బిడ్డను చూపిస్తున్న సిబ్బంది

బైరెడ్డిపల్లె: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యాధికారుల సలహాలను పాటించాలని, ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు సురక్షితమని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. జమ్ముగుండ్లపల్లెకు చెందిన రామమూర్తి భార్య రమాదేవికి పురిటినొప్పులు రావడంతో సోమవారం సాయంత్రం తీర్థం పీహెచ్‌కి చేరుకుంది. దీంతో రమాదేవిని పరిశీలించిన వైద్యాధికారి అరుణ్‌కుమార్ ధైర్యం చెప్పి ప్రభుత్వాస్పత్రిలోనే కాన్పు అయ్యేలా చేస్తామన్నారు. రమాదేవికి మగబిడ్డ పుట్టగానే రామమూర్తి సంతోషం వ్యక్తం చేశారు. ఖర్చు లేకుండా ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేసిన వైద్యాధికారికి, ఆరోగ్యసిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు

యాదమరి: కాశిరాళ్ల మహిళా జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభించామని ప్రిన్సిపల్ లలిత తెలిపారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక సదుపాయాలతో పాటు విద్య, పుస్తకాలు, బ్యాగ్స్, నోటుపుస్తకాలు ఉచితంగా అందిస్తామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో ఎస్ఈఈటీ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందిస్తామని చెప్పారు. ఆంగ్ల మాధ్యమంలో ఎంబైపీసీ విభాగంలో చేరే వారికి ఈనెల 7 సోమవారం నుంచి మొదటి సంవత్సర తరగతులు ప్రారంభం అవుతాయని ఆమె చెప్పారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



సంధ్య

గుడిపాల: ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ సంధ్య సూచించారు. ఆమె వైద్యశాలలో మంగళవారం మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎండలో ఎక్కువగా తిరగకూడదని, బయటకు వెళ్లాల్సివస్తే గొడుగు, టోపీ వంటివి వాడాలని, ముఖంపై కర్చీఫ్ లాంటివి కట్టుకోవాలన్నారు. తగినన్ని నీళ్లు తాగాలని, వదులుగా ఉండే దుస్తులు ధరించాలని చెప్పారు. శరీరం వేడెక్కినట్లు, తల తిరిగినట్లు ఉండి శరీర ఉష్ణోగ్రత పెరిగితే ఓఆర్ఎస్, ఇతర ద్రవ పదార్థాలు తాగాలని సూచించారు. అధికవేడి, తలనొప్పి, వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బ సంకేతాలుగా భావించాలన్నారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైతే తప్ప బయటకు రాకూడదన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే సమీపంలో ఆశా కార్యకర్త, ఏఎన్ఎంలను సంప్రదించి చికిత్స చేయించుకోవాలన్నారు. వైద్యశాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్



ప్రిన్సిపల్ జగన్నాధరావు

కుప్పం రూరల్: ఈ నెల 30న జరగనున్న పాలిసెట్–2025కు కుప్పం పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జగన్నాధరావు తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి 24 వరకు ఉచితంగా కోచింగ్ ఇస్తామన్నారు. 10వ తరగతి విద్యార్థులు గణిత, భౌతిక, రసాయన శాస్త్రాల పుస్తకాలు, నోట్ పుస్తకాలు తెచ్చుకోవాలని కోరారు. ఇప్పటి వరకు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఈ నెల 15లోపు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తులు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9490309037, 9989064100 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

96శాతం పింఛన్ల పంపిణీ



పింఛన్ ఇస్తున్న మున్సిపల్ కమిషనర్

పలమనేరు: మున్సిపాలిటీలో 96శాతం మందికి సామాజిక పింఛన్లను పంపిణీ చేసినట్టు స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మంగళవారం తెలిపారు. ఇక్కడ మొత్తం 4,524మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా 4,313 మందికి అందజేశామని ఆయన పేర్కొన్నారు.

వేతనాలు బ్యాంకుల్లో జమ చేయండి



ఆందోళన చేస్తున్న నేతలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతితో పనిచేస్తున్న స్వీపర్లు, ఆయాలకు వేతనాలను బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.నాగరాజన్ డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం స్వీపర్లు, ఆయాలతో కలిసి ఆందోళన చేశారు. నాగరాజన్ మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా పాఠశాలల్లో పని చేస్తున్న తాత్కాలిక సిబ్బందికి వేతనాలు మంజూరు చేయడంలో అధికారులు పారదర్శకత పాటించడం లేదని చెప్పారు. దీనిపై కమిషనర్ స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ప్రజారోగ్యశాఖ డా.లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యూనియన్ నేతలు గోపినాథ్, చంద్ర, రమాదేవి, రమేష్, భువనేశ్వరి, సెల్వి, మేరీ పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు పూజలు



అమ్మవారికి దీపాలు తీసుకెళుతున్న మహిళలు

పుంగనూరు: తెలుగు నూతన సంవత్సర తొలి మంగళవారం కావడంతో మండలంలోని మార్లపల్లెలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో దీపాలు పెట్టి పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఉపవాస దీక్షలతో అమ్మవారికి నెయ్యిదీపాలు, చల్లముద్ద పెట్టి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కుమార్‌రాజా

బంగారుపాళెం: మండల కేంద్రంలో మంగళవారం త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత కమిటీ ఆధ్వర్యంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, బంగారుపాళెం–1 ఎంపీటీసీ సభ్యులు పద్మావతి, మాజీ వైస్ ఎంపీపీ హిమకర్ రాజా క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం పలువురికి త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్లను ఉచితంగా అందజేశారు. త్రైత సిద్ధాంత కమిటీ అధ్యక్షుడు బాలాజీ, సభ్యులు పాల్గొన్నారు.